నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా మహేంద్రహిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అర్చన ఎన్‌క్లేవ్, వాల్మీకి నగర్, గాంధీనగర్, శేషాచల కాలనీ, సంజీవయ్య హౌసింగ్ సొసైటీ, తిరుమల కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీ కృష్ణ తెలిపారు. చంద్రపురం 11 కేవీ ఫీడర్ పరిధిలో 11.30 నుంచి 12 గంటల వరకు చంద్రపురం కాలనీ, మంగాపురం, రవికాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రవి కాలనీ, రోడ్ నంబర్ 4 టీఎంసీ, ధనలక్ష్మి కాలనీ, వైజయంతి కాలనీ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతినికేతన్ 11 కేవీ ఫీడర్ పరిధి లోని శాంతినికేతన్, బాలంరాయి. ధనలక్ష్మి కాలనీ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

స్కంధగిరి ఆలయంలో మర్రి శశిధర్ రెడ్డి పూజలు



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: పౌర్ణమిని పురస్కరించుకుని పద్మారావునగర్‌లోని స్కంధగిరి దేవాలయంలో జరిగిన కుంభాభిషేకం మహోత్సవంలో ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. శశిధర్‌రెడ్డి వెంట స్థానిక బీజేపీ నేత చంద్రపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బోటనీ హెడ్‌గా ప్రొ.సబితారాణి



ప్రొ.సబితా రాణిని అభినందిస్తున్న డా.సుమన్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ బోటనీ విభాగం హెడ్‌గా ప్రొ.సబితా రాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హెడ్‌గా పని చేసిన ప్రొ.రమాదేవి కాల పరిమితి ముగియడంతో ప్రొ.సబితా రాణిని హెడ్‌గా నియమిస్తూ ఓయూ వీసీ ప్రొ.కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బోటనీ విభాగం పార్ట్‌టైం అధ్యాపకులు డా.సుమన్ కుమార్, డా.రామగాళ సుందర్, కిరణ్‌కుమార్, డా.రఘు, డా.మంజుల, డా.పరమేష్ తదితరులు సబితా రాణికి అభినందనలు తెలిపారు.

యువతి అదృశ్యం



నేహ (ఫైల్)

రాంగోపాల్‌పేట్: షాపింగ్ మాల్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్న యువతి అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గన్‌రాక్‌కు చెందిన గంగమ్మ కుమార్తె నేహ (19) ప్యాట్నీ సెంటర్‌లోని చెన్నై షాపింగ్ మాల్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. ఈ నెల 10న డ్యూటీకి వచ్చిన ఆమె సాయంత్రం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆమె తల్లి గంగమ్మ మంగళవారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పనిచేసే షాపింగ్ మాల్‌కు వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..దోమల్‌గూడకు చెందిన శ్రవణ్ కుమార్ (37), మౌనిక దంపతులకు ఒక కుమార్తె ఉంది. గత కొన్నేళ్లుగా కుటుంబ కలహాల కారణంగా వారు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నెల 9న తన భార్య మౌనిక పనిచేసే కామాక్షి సిల్క్స్‌కు వచ్చిన శ్రవణ్ కుమార్ తనతో పాటు తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మార్కెట్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. షాపింగ్ మాల్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించం

- కొనసాగుతున్న కూల్చివేతలు
- పలు అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- కన్నీటి పర్యంతమైన బాధితులు
- ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు



విలపిస్తున్న మహిళలు



అడ్డగుట్టలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అడ్డగుట్ట: రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే సహించేది లేదని జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అన్నారు. ఈ మేరకు మంగళవారం మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరకు రహదారిపై ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా అక్రమ నిర్మాణాల తొలగింపులో అధికారులకు సహకరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకట్‌నగర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇది వరకే రోడ్డును ఆక్రమించుకుని పలువురు షెడ్లను నిర్మించుకోవడంతో రోడ్డు నిర్మాణ పనులకు ఇబ్బందిగా మారింది. సదరు షెడ్లను తొలగించాలని యజమానులకు పలుమార్లు సూచించినా వారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తుకారాంగేట్ పోలీసుల సహకారంతో సదరు షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా పలువురు నివాసితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న తమకు ప్రత్యామ్నాయం చూపాలని అధికారులను కోరారు. రోడ్లను ఆక్రమించుకుని షెడ్లు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసుకున్న వారందరూ వెంటనే వాటిని తొలగించాలని, లేని పక్షంలో వాటిని కూడా తొలగిస్తామని హెచ్చరించారు.

రెండ్రోజులు గడువివ్వలేదు..

రోడ్డు ఆక్రమణలో తొలగింపులో భాగంగా తమ బాత్‌రూమ్‌ను కూల్చివేయడంతో ఓ కుటుంబానికి చెందిన మహిళలు కన్నీటి పర్యంతమైయ్యారు. ఉన్న రెండు ఇరుకు గదుల్లో కుటుంబం మెసలడం కష్టంగా ఉందని, ఇంటి ముందున్న స్థలంలో బాత్‌రూమ్ నిర్మించుకున్నామని, అధికారులు దానిని కూల్చివేశారన్నారు. ఇంట్లో వృద్ధులు, మహిళలు, ఉన్నారని చెప్పినా అధికారులు కనికరించలేదని, రెండ్రోజులు గడువిస్తే తామే తొలగిస్తామని చెప్పినా వారు వినిపించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కనుల పండువగా కావడి ఉత్సవం

- స్కంధగిరి దేవాలయంలో ఘనంగా కావడి పాల్కుడం మహోత్సవం...
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం



కావడి ఉత్సవంలో భాగంగా దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ స్కంధగిరి సుబ్రమణ్యం దేవాలయంలో మంగళవారం కావడి పాల్కుడం మహోత్సవం, తైపూసం లక్షార్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. నగర నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి లక్షార్చన సంపూర్ణం, పుష్పాంజలి, , మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. దేవతా మూర్తులను పూలతో అలంకరించారు.

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు

కావడి పాల్కుడం ఉత్సవంలో పాల్గొనేందుకు నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కావడి, పాలకుండలతో నృత్యాలు చేస్తూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భగవన్నామస్మరణతో స్కందగిరి పురవీధులు మారుమోగాయి.

14న బేగంపేట శ్రీశక్తి కళాశాలలో 'జోబోథాన్-2025'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయేష్ రంజన్

సనత్‌నగర్: బేగంపేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీశక్తి ఆధ్వర్యంలో 'జోబోథాన్-2025' పేరిట ఈ నెల 14న ఆతిథ్య ఉద్యోగ మేళాను నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఐటీ, ఇండస్ట్రియల్ అండ్ కామర్స్ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బేగంపేటలోని శ్రీశక్తి కళాశాల ప్రాంగణంలో 14న జరిగే మేళాలో 25 ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. తాజ్ గ్రూప్, ఐటీసీ వెల్‌కమ్, హయత్, మారియట్, రాడిసన్ తదితర ప్రముఖ అతిథ్య రంగ సంస్థలు ఇందులో పాల్గొననున్నాయన్నారు. పురోగమిస్తున్న ఆతిథ్య రంగంలో ప్రపంచ వ్యాప్తంగా మరిన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రముఖ విదేశీ కన్సల్టెన్సీ సంస్థలైన కెరీర్ క్రాఫ్టర్, ఏఎస్పీడీ, ట్రివల్ చాప్టర్ వంటి సంస్థలు స్కిల్ ఇమ్మిగ్రేషన్, జే1 వీసా, ఇంటర్నేషనల్ ట్రైనింగ్‌పై ఆసక్తి గల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయన్నారు. ఆసక్తి గల ఆతిథ్య రంగ విద్యార్థులు, నిరుద్యోగ యువత 94404 09988 నెంబర్‌లో సంప్రదించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

నేడు చండీహోమం..

సనత్‌నగర్: మాఘ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో బుధవారం ఉదయం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, 10 గంటలకు దత్త హోమం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

'సెల్ట్ 'లో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ అనుబంధ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజెస్ ట్రైనింగ్ (సెల్ట్)లో స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 10 ఆ పైన విద్యార్హత గల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు, తదితరులు అర్హులని డైరెక్టర్ ప్రొ.సౌడ సవీన్ పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7989903001/ 9849752655 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సీ గ్రౌండ్స్‌లో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్, విద్యాసాగర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవరెడ్డి, పెద్దమ్మ రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 32, పందిరి బీర 40, క్యాబేజీ 9, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పార్కుల అభివృద్ధికి చర్యలు



నాగార్జున నగర్ కాలనీ పార్కులోని ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ తదితరులు

లాలాపేట: పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌తో కలిసి తార్నాక డివిజన్ నాగార్జున నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని పార్కులను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కాలనీలోని పార్కుల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సీనియర్ సిటిజెన్స్ సేద తీరేందుకు బెంచీలు, పార్కుల్లో పచ్చదనం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొ కోదండరాం, టీటీయుసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, ఏఈ వేణు, స్థానికులు ప్రొ తిరుపతిరావు, జలంధర్‌రెడ్డి, ఆలకుంట హరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'తప్పుల తడకగా ఎస్సీ వర్గీకరణ'

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో హడావిడిగా చేపట్టిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తప్పుల తడకగా ఉందని మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మందాల భాస్కర్ అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు హయాంలో చేపట్టిన తరహాలోనే డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క లేకుండా ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ చేయడం దారుణమన్నారు. మాదిగల ఓట్ల కోసం ఎవరినీ సంప్రదించకుండా, పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా చేపట్టిన వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా జన గణన చేపట్టి అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ చేపట్టిన తర్వాతే తెలంగాణలో వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణకు చిత్తశుద్ధి లేదన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులను కలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.నవీన్, డా.వెంకటేశ్వర్లు, డా.ఉదయ్‌కుమార్, విద్యార్థి నాయకులు అంగరీ ప్రదీప్, మాదాసు రాహుల్, నామా సైదులు, భాను తేజ, సంతోష్, ప్రవీణ్, అరుణ్, కిశోర్, రేణు,రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం



కోదండరాంను సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. విద్యార్థులను ఆత్మగౌరవంతో బతికేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని హిల్‌స్ట్రీట్ పాఠశాలలో మంగళవారం ఐపీఎఫ్ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చదువుతోనే మనిషికి గౌరవం వస్తుందన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి, వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. సాంకేతికతనుసద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. సామాజిక మార్పు ఉపాధ్యాయులతోనే సాధ్యమని, వారు బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీధర్, వివిధ పాఠశాలలో హెచ్ఎంలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజెల్లయ్య సేవలు ఎనలేనివి



రాజెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: అణగారిన వర్గాల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన వ్యక్తి ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండూరు రాజెల్లయ్య మాదిగ అని పలువురు వక్తలు కొనియాడారు. రాజెల్లయ్య జయంతి సందర్భంగా బన్సీలాల్‌పేట్ బండమైసమ్మనగర్ అంబేడ్కర్ యువజన సంఘంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. సభలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, రాజేందర్, కుర్మ మహేందర్, బీజేపీ నాయకులు కేఎం క్రిష్ణ, వై. సురేష్ కుమార్, ఆర్. మహేష్, జేఏసీ నాయకులు జగ్గు, సత్తి, సతీష్, మహేందర్, వినయ్, కె. రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు టీవీ నర్సింహ, దుప్పు మల్లికార్జున్, రవి, అరుణ్, జయరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకు మంద క్రిష్ణమాదిగ నేతృత్వంలో జరిగిన ఉద్యమంలో రాజెల్లయ్య తుది శ్వాస వరకు పోరాడారన్నారు. బన్సీలాల్‌పేట్ యువజన సంఘానికి రాజెల్లయ్య స్మారక భవనంగా నామకరణం చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ మురికివాడ ప్రజల ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు పోరాడిన వ్యక్తి రాజెల్లయ్య అన్నారు. కార్యక్రమంలో రాజెల్లయ్య సతీమణి భాగ్య, కుమారుడు సుచేంద్ర, కుమార్తె స్పందన, స్థానిక నాయకులు రాపాక అశోక్, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, ఫయామ్, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కోటి కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో కోటి కుంకుమార్చన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 8 నుంచి 12 వరకు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. పూజల్లో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి రోజు లలితా సత్సంగ్ బృందం ఆధ్వర్యంలో సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారంతో పూజలు ముగియనున్నట్లు ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.

తెల్లవారుజామున విద్యార్థుల ఇళ్ల సందర్శన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఐఓఎస్ మదన్ మోహన్

అడ్డగుట్ట: పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులందరూ కష్టపడి చదవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ ఐఓఎస్, అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున ఆయన అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థుల ఇళ్లను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు ఉదయాన్నే నిద్రలేచి చదువుకుంటూ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారా లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలన్నారు. అప్పుడే మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకువస్తారన్నారు. పిల్లలను ఉదయాన్నే నిద్రలేపి చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల స్కూల్ సిబ్బంది, ఎంవి ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'రంగరాజన్‌పై దాడి అనైతికం'

రాంగోపాల్‌పేట్: చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి అనైతికమని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రామరాజ్యం పేరుతో కొందరు సంఘ విద్రోహ శక్తులు చిలుకూరి బాలాజీ దేవాయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి పాల్పడటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మికత, భక్తి పేరుతో తాము చెప్పినట్లు నడుచుకోవాలని ఇతరులపై దాడులు చేసే సంస్కృతి మానుకోవాలని సూచించారు. మతం పేరుతో గతంలో పాస్టర్లు, చర్చిలపై దాడులు చేసిన వారు ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, అర్చకులపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు మతం ముసుగులో ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా సంస్థలను స్థాపించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. యువతీ, యువకులను ఆకర్షిస్తూ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న సంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎలివేటెడ్ కారిడార్ బాధితులకు న్యాయం చేస్తా



రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఫిషర్ పురా బస్తీ వాసులు

రసూల్‌పురా: జేబీఎస్, శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఉపాధి కోల్పోతున్న అల్వాల్ రైతు బజార్ రైతులు, వ్యాపారస్తులకు మరో చోటు భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం అల్వాల్ రైతు బజార్‌ను సందర్శించిన ఆయన రైతులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు మాట్లాడుతూ దశాబ్దాలుగా తాము రైతు బజార్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని ఎలివేటెడ్ కారిడార్ విస్తరణలో భాగంగా భూమిని కోల్పోతే తాము రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అల్వాల్ రైతు బజార్ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బోర్డు తరపున లేదా రాష్ట్ర ప్రభుత్వ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అత్యాధునిక రైతుబజార్ నిర్మాణానికి కృషి చేస్తానని, రైతులు, వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అరవింద్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు రామన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌పురా బస్తీవాసుల సమస్యలను పరిష్కరిస్తా..

ఫిషర్‌పురా బస్తీవాసులకు తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ లీజు స్థలాల్లో ఉంటున్న సుమారు 200 కుటుంబాలకు లీజు గడువు పూర్తయినందున ఖాళీ చేయాలంటూ బోర్డు అధికారులు నోటీసు జారీ చేశారు. వందేళ్లకు పైగా నివాసం ఉంటున్న తమను ఉన్న ఫలంగా ఖాళీ చేయించడం దారుణమని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బస్తీవాసులు మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి విన్నవించారు. ఫిషర్ పురా బస్తీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాను సైతం బోర్డు అధికారులతో మాట్లాడి, లీజు గడువును పొడిగించడం లేదా ఇతర ప్రత్యామ్నాయాలపై చర్చిస్తానన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379